క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరికలు



మాగనూర్: మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. గారెలు అశోక్‌గౌడ్, రాధిక, ఐడీసీ మారెప్ప, బింగి తాయప్ప, మంగలి గోపాల్, ఈడ్గి నవీన్‌గౌడ్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు డిజిల్ సాయిబన్న, పూల రాములు, పల్లె మారెప్ప, లక్ష్మణ్, వాకిటి రాజు, ఆడివప్ప, గజ్జపతి, వెంకటేష్, నారాయణ, ఈశ్వర్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

మాగనూర్: మండలం నూతన ప్రెస్‌క్లబ్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీనియర్ పాత్రికేయులు ప్రహ్లాద్‌రెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా దండు రాము , గౌరవ అధ్యక్షుడిగా వి.రాజు, ఉపాధ్యక్షుడిగా సగరం రాజు నరేశ్ , ప్రధానకార్యదర్శిగా పి.సురేష్ , కోశాధికారిగా శ్రీనివాసులు సలహాదారుడుగా చంద్రశేఖర్‌గౌడ్ , కార్యవర్గ సభ్యులుగా ప్రహ్లాద్‌రెడ్డి, నాగేష్, రమేష్‌గౌడ్, కథలప్ప, అంజనేయులు, అశోక్, భాస్కర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



మాగనూర్: నాగర్ కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించిన మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ కూతురు నందినిను బ్రిలియంట్ హైస్కూల్ పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. నీట్ యూజీ పరీక్షలో 455 మార్కులు సాధించి మెడికల్ సీటు సాధించడాన్ని తల్లిదండ్రులతో పాటు విద్యార్థినిని అభినందించి శాలువా, మెమోంటోతో సత్కరించారు. ఎంబీబీఎస్‌ను పూర్తి చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కోస్గి: పట్టణ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. పోలేపల్లి రోడ్డులో స్థావరం ఏర్పాటు చేసుకొని పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.19,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఆరుగురిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ పేర్కొన్నారు. పట్టణంలో పలుచోట్ల పెద్ద మొత్తంలో పేకాట విచ్చలవిడిగా కొనసాగుతున్నట్లు పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. స్థానిక పోలీసులు పేకాట స్థావరాలపై దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో 16 గొర్రెల మృతి



ధన్వాడ: పట్టణంలోని గొల్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 16 గొర్రెలు మృతి చెందాయి. యంనోనిపల్లి గ్రామానికి చెందిన కురువ మహేష్ గొర్రెలను మేత కోసం తీసుకెళ్తుండగా హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న కారు అదుపుతప్పి గొర్రెలపై నుంచి దూసుకెళ్లి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో గొర్రెలు మృతి చెందగా తీవ్ర నష్టం వాటిల్లిందని మహేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు బస్వాయపల్లికి చైతన్యానంద స్వామి

దేవరకద్ర: మండలంలోని బస్వాయపల్లిలో సైలెంట్ వ్యాలీ ధ్యాన కేంద్రానికి బుధవారం శుద్ధ చైతన్యానంద స్వామి రానున్నారని పిరమిడ్ ధ్యానకేంద్రం ప్రతినిధి పారిజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు సైలెంట్ వ్యాలీ కార్యక్రమం ఉంటుందని ధ్యాన ప్రతినిధులు ఉదయం 8:30 గంటలకే రావాలని కోరారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు.

20 రోజుల్లోనే.. ఇందిరమ్మ ఇల్లు



మోమినాపూర్‌లో ఆర్‌సీసీ ద్వారా నిర్మిస్తున్న ఇల్లు

- ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీ
- ఇటుకలు వాడకుండానే నిర్మాణం
- పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మోమినాపూర్‌లో 3 ఇళ్ల నిర్మాణం

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో 'ఇందిరమ్మ ఇళ్లు' అనే సంక్షేమ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇళ్లు నిర్మించుకునే పేదలకు దశల వారీగా రూ.5లక్షలు మంజూరు చేస్తుంది. అయితే ఈ పథకంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఓ బిల్డర్ కొత్త టెక్నాలజీని వినియోగించి కేవలం 20 రోజుల్లోనే ఇంటిని నిర్మించి లబ్ధిదారులకు ఇస్తున్నారు. నిర్మాణంలో ఎటువంటి ఇటుకలు వాడకుండనే కేవలం ఆర్‌సీసీతో ఇంటిని నిర్మించడం నూతన టెక్నాలజీ ప్రత్యేకత. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు ఏ మాత్రం సరిపోవు అనేకునే వారికి హైదరాబాద్‌కు చెందిన నరేందర్‌రెడ్డి అనే బిల్డర్ ఆర్‌సీసీ (రీన్ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్) పద్ధతి ద్వారా రూ.5లక్షలతో 20 రోజుల్లోనే మొత్తం ఇంటిని నిర్మించి లబ్ధిదారులకు అందజేస్తున్నాడు.

మోమినాపూర్‌లో ఇళ్ల నిర్మాణం

మండలంలోని మోమినాపూర్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టడానికి స్థోమత లేకపోవడంతో ఈ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహను సంప్రదించారు. నర్సింహ హైదరాబాద్‌లో నరేందర్ రెడ్డి అనే వ్యక్తి రూ.5 లక్షలకే ఇంటి నిర్మాణం చేపట్టుతున్నట్లు తెలుసుకొని ఆయన్ను పిలిపించి ఇంటి నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో నరేందర్ రెడ్డి పైలెట్ ప్రాజెక్టుగా కొత్త పద్ధతిలో 3 ఇళ్లు నిర్మించాలని భావించి ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. ఇందులో మొదట బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేపట్టి, అల్యూమినియం షీట్స్‌ను గోడల స్థానంలో ఉంచి వాటి మధ్యలో ఇనుప చువ్వలను ఏర్పాటు చేసి ఆర్‌సీసీ పోయడంతో ఇంటి నిర్మాణం 20 రోజుల్లోనే పూర్తవుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు..

ఇంటి నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనల మేరకు 410 చదరపు ఫీట్ల స్థలంలో ఒక బెడ్ రూం, హాల్, కిచెన్, బాత్రూమ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. లబ్ధిదారులు మొదట రూ.లక్ష నగదు చెల్లిస్తే అన్ని సౌకర్యాలు కల్పించి ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మిగతా నగదు తీసుకొని లబ్ధిదారులకు ఇంటిని అందజేస్తారు. ఏది ఏమైనా ఇళ్లు కట్టుకోలేనివారికి కేవలం 20 రోజుల్లోనే ఇళ్లు నిర్మించి ఇస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుణపడి ఉంటాం



పూటగడవకపోవడంతో హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. స్థలం ఉన్న ఇల్లు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేసింది. అయిన నిర్మాణం చేపట్టడానికి స్థోమత లేకపోవడంతో కాంగ్రెస్ నేత నర్సింహ, కుటుంబ సభ్యుల సహకారంతో ఇంటి నిర్మాణం చేపట్టాం. ఇల్లు ప్రస్తుతం స్లాబ్ వరకు పూర్తి కాగా త్వరలోనే ఇంటిని అందజేస్తామన్నారు. ప్రభుత్వానికి తాము రుణపడి ఉంటాం.

–కావాలి లక్ష్మి, లబ్ధిదారురాలు, మోమినాపూర్

ఇల్లు కట్టుకోలేని వారికి నిర్మించి ఇస్తాం



ఇళ్లు మంజూరైన నిర్మాణం చేపట్టలేని నిరుపేదల కోసం కొత్త పద్ధతిలో 20 రోజుల్లోనే ఇల్లు నిర్మించి ఇస్తాం. మోమినాపూర్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా మొదట 3 ఇళ్లు ఈ పద్ధతిలో నిర్మిస్తున్నాం. ప్రస్తుతం మూడు ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. త్వరలోనే మొత్తం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం.

–నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్, మోమినాపూర్

పత్తి రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న పత్తి పంట

మరికల్: మండలంలోని పత్తి రైతులను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు. ఈ ఏడాది అత్యధికంగా కురిసిన వర్షాల వల్ల పత్తి కాయలు నల్ల బారడంతో రైతులకు తీరాన్ని నష్టాన్ని మిగిలించాయి. ప్రతి ఏడాది ఐదు సార్లు తీసే పత్తి ఈసారి మాత్రం రెండు సార్లకే పరిమితమైంది. ఎకరా వెంబడి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పత్తి, వర్షాల ప్రభావంతో కేవలం 3 నుంచి 5 క్వింటాళ్ల లోపే వస్తుంది. దీంతో ఎకరాకు దాదాపు రూ. 20 వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.



మాద్వార్‌లో వరికి పిచికారీ చేస్తున్న రైతులు

వరి పంటకు దోమ పోటు

మక్తల్: ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంటకు ఆకు ఎరుపు, దోమ పోటు తెగుళ్లు వ్యాపిస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మాద్వార్, లింగంపల్లి, ఉప్పర్‌పల్లి, సంగంబండలతో పాటు ఇతర గ్రామాల్లో రైతన్నలు అధికంగా వరి పంట సాగు చేశారు. అయితే భారీ వర్షాలకు పంటకు దోమపోటు వ్యాపించడంతో పంట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు కాపాడుకోవడానికి ఫర్టిలైజర్ మందులను పిచికారీ చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై సిబ్బందికి అవగాహన సదస్సు

నారాయణపేట: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని సీడీపీఓలందరికీ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జయచంద్ర మోహన్ మాట్లాడుతూ సీడీపీఓలు ప్రతి కార్యక్రమంలో సాధారణ గర్భిణీతో పాటు హెచ్ఐవీ సోకిన గర్భిణులకు వారి పిల్లలకు వైద్యంతో పాటు పోషకాహారం అందే విధంగా కృషి చేయాలన్నారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవి సోకకుండా తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలన్నారు. అదేవిధంగా 1097 (హెచ్ఐవి ఎయిడ్స్) టోల్ ఫ్రీ నెంబర్ పైన విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శైలజ, శ్రీధర్, శ్రీలత, సీడీపీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయచంద్రమోహన్

బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

మరికల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి అన్నారు. మరికల్‌లో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచించిన మేరకు ఒంటరిగానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు గాను ముఖ్య నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేసి ఎక్కువ స్థానాల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. అనంతరం పోటీ చేసే అభ్యర్థుల వివరాలను కార్యకర్తల సూచన మేరకు ఎంపిక చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్, రాజేష్, సురేందర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, కుర్మన్న, తిరుపతిరెడ్డి, నర్సిములు, శ్రీరామ్, మహేష్‌శెట్టి, ఓంప్రకాష్, శివ, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



అమరచింత: రోజురోజుకు సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సీఐ శివకుమార్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో వచ్చిన ప్రతి మెసేజ్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని, ట్రాలీ ఆటోలలో పరిమితికి మించి కూలీలను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



దేవరకద్ర: మున్సిపాలిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో దేవరకద్ర ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమున్న వారిని బుధవారం ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించి శస్త్రచికిత్సలు చేయిస్తామని వైద్యులు తెలిపారు. క్యాంపు ఆర్గనైజర్స్ ఓబుల్‌రెడ్డి, వినేశ్, వైద్యనిపుణులు వరుణ్ పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులపై ఆగ్రహం

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండకు ఇటీవల నిర్మించిన డబల్ రోడ్డు పక్కన మొక్కలు నాటేందుకు ఫారెస్ట్ అధికారులు రహదారిని ధ్వంసం చేయడం పట్ల సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీబీని ఇష్టారీతిగా రోడ్డుపై నడుపుతూ మొత్తం గుంతలు పడే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. మొక్కలు నాటే ప్రక్రియను నిలుపుదల చేసి ఆర్ అండ్ బీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న రహదారుల శాఖ అధికారులు ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి రోడ్డు పాడవకుండా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, దామోదర్, సలీం పాల్గొన్నారు.

అమరచింతలో కవాతు



అమరచింత: 'నమస్తే సదా వత్సలే మాతృభూమి' అంటూ ప్రతిజ్ఞతో పట్టణంలోని పలు వీధుల్లో ఆర్ఎస్ఎస్ సంఘ సభ్యులు మంగళవారం కవాతు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుకల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ ధర్మ జాగరణ విభాగ్ ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ రిటైర్డ్ టీచర్ లింగన్న, ఎల్ల బాలస్వామి, బావండ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

ఆత్మకూర్: రైల్లో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. గద్వాల మండలం షాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైల్లో షాద్‌నగర్ నుంచి గద్వాలకు వెళ్తున్నాడు. ఆత్మకూర్ మండలంలోని దేవరపల్లి గ్రామ సమీపంలో రైలు డోర్ వద్ద నుంచి శివకుమార్ జారి పడిపోయాడు. అక్కడే ఉన్న రైతులు గమనించి తీవ్ర గాయాలైన శివకుమార్‌ను 108లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వనపర్తి ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఆస్ట్రో ల్యాబ్ ఏర్పాటుపై శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో ప్రారంభించనున్న ఆస్ట్రో ల్యాబ్‌కు సంబంధించిన భౌతికశాస్త్రం ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆస్ట్రో ల్యాబ్ రీసోర్సు పర్సన్ మిత్రా ల్యాబ్‌కు సంబంధించిన పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 42 రకాల ప్రయోగాలు, నక్షత్రాలు, గ్రహాలు తదితర అంశాల కోసం ల్యాబ్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్, ఉపాధ్యాయులు ఏఎంఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన విగ్రహ ప్రతిష్ఠాపన

మద్దూరు: పట్టణంలోని కాచెరువు కట్టపై పునర్‌నిర్మాణం చేపట్టిన ఆలయంలో 'కట్ట మైసమ్మ' విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం కొనసాగింది. అంకురార్పణ, పుణ్యావచనం, గణపతి, నవగ్రహ హోమాలతో పాటు మూలవిరాట్టు విగ్రహానికి జలాధివాసం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకట్‌రాములు, ప్రకాష్, రామకృష్ణ, వెంకటప్ప పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

మద్దూరు: మండలంలోని నందిపాడ్ గ్రామంలో మంగళవారం నాభిశిలా (బొడ్రాయి) ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజుల పాటు నాభిశిలా ప్రతిష్ఠాపన ఉత్సవాల సందర్భంగా పున్యావచనం, అంకురార్పణ, గణపతి, శీతల హోం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం తెల్ల వారుజామున యంత్ర ప్రతిష్ఠాపన అనంతరం నాభిశిలను ప్రతిష్ఠించారు. గ్రామంలోని ఇంటింటికి బోనాల ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆడపడుచులందరు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



నాభిశిలకు పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో దసరా ముగింపు ఉత్సవాలు

నారాయణపేట టౌన్: దసరా ఉత్సవ ముగింపు సందర్భంగా శ్రీ సోమవంశ క్షత్రియ సమాజ్ ధూల్పేట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం అంబభవాని మాతకు పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు, విద్యార్థి సంఘాల అధ్యక్షులు, మహిళా మండలి అధ్యక్షురాలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

అమ్మవారికి కుంకుమార్చన పూజలు

దామరగిద్ద: మండల కేంద్రంలో వెలసిన భవాని మాత ఆలయంలో నవరాత్రి ముగింపు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు, భక్తులు అమ్మవారికి కుంకుమార్చన చేసి, ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భవానీ మందిర్‌లో ప్రత్యేక పూజలు

ఊట్కూర్: ఊట్కూర్‌లోని భవానీ మందిర్‌లో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు చౌద్రి అశోక్, డాక్టర్ సుభాష్, చంద్రప్రకాశ్, వెంకట్‌రావు, భీంరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సభ్యులు



భవానీ మాత పూజల్లో పాల్గొన్న భక్తులు

కిశోర్ దాస్‌ను కఠినంగా శిక్షించాలి

నారాయణపేట టౌన్: ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పైన బూటు విసరి దాడికి ప్రయత్నించిన నిందితుడు రాకేష్ కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మోదీ పరిపాలనలో మతోన్మాదుల దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతం పేరుతో మైనారిటీలపై దాడి, కులం పేరుతో దళితులపై దాడి, మహిళలపై, ప్రజాస్వామిక వాదులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. దేశంలో మతోన్మాద విద్వేష భావజాలం పెరగడంతో సభ్య సమాజం తలదించుకునే ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బండమీది బలరాం, జిల్లా నాయకులు అరుణ్, చుక్క గోవింద్, పవన్ కుమార్, వెంకటప్ప, వడ్డే రాము తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

న్యాయమూర్తిపై దాడి అమానుషం

దామరగిద్ద: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం అమానుషమని, దేశానికి తలవంపు చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాల్ అన్నారు. ఈమేరకు దాడిని ఖండిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ నిందితుడు కిశోర్ దాస్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాల్మీకి జీవిత చరిత్ర మనందరికీ ఆదర్శం



వాల్మీకికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ లింగయ్య



మాగనూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు సూచించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వేడుకలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

- నారాయణపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పోలీసు అధికారులు సిబ్బందితో కలసి డీఎస్పీ లింగయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సామాన్య వ్యక్తిగా పుట్టి రామాయణం అనే అమరగ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి మనందరికీ ఆదర్శమన్నారు. ఆర్ఐ నరసింహ, ఎస్‌బీఎస్ఐ నరేష్, ఆర్ఎస్ఐలు శివ శంకర్, శిరీష, డీపీఓ సూపరింటెండెంట్ శంకర్ లాల్ పాల్గొన్నారు.
- నారాయణపేట మండలంలోని స్థానిక ఆలయంలో భీమ్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజకుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహర్షి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కృష్ణయ్య నరసింహ మారుతి నరేష్ పాల్గొన్నారు.
- మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర వాల్మీకి చిత్రపటానికి వాల్మీకి సంఘం నాయకులు పూలమాలు వేసి నివాళిలు అర్పించారు. అలాగే కర్ని, గడ్డంపల్లి, అనుగొండ గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు.
- నర్వలోని వాల్మీకి మహర్షి ఆలయంలో మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెద్దకడ్మూర్‌లో ఆంజనేయస్వామి ఆలయం నుండి పల్లకి సేవతో పాటు భారీ ఊరేగింపు నిర్వహించారు.
- మాగనూర్‌లోని బస్టాండ్ చౌరస్తాలో వాల్మీకి సంఘం నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆత్మశోధన ద్వారా మహానుభావుడిగా మారి, మనందరికీ ఆదర్శప్రాయమైన రామయణం అనే గ్రంథాన్ని రచించారన్నారు.
- మరికల్‌లోని ఆంజనేయస్వామి ఆవరణలో గల వాల్మీకి విగ్రహానికి జల, పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఊట్కూర్‌లో వాల్మీకి జయంతిని పురస్కరించుకొని కృష్ణా నది నుంచి జల్దిబిందెతో నీరు తెచ్చి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేటలోని జలాల్ పూర్‌లో..



మక్తల్‌లో వాల్మీకి జయంతి జరుపుకొంటున్న వాల్మీకి సంఘం నాయకులు